## నాటిన ప్రతిమొక్కనూ సంరక్షించాలి

### మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** వనమహోత్సవంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోస్టాఫీస్ చౌరస్తా నుండి పొట్టి శ్రీరాములు చౌరస్తా వరకు వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ సిఎం కెసిఆర్ తీసుకవచ్చిన హరితహారం కార్యక్రమాన్ని వనమహోత్సవం పేరుతో సిఎం రేవంత్ రెడ్డి కొనసాగించడం హర్షణీయం అన్నారు. పట్టణ ప్రజలు ప్రతి ఒక్కరు తమ నివాస ప్రాంతాల్లో మొక్కలు నాటి కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ వెలుగు వెంకన్న, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ జికెడి ప్రసాద్, శానిటరి ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఏఈ వరుణ్, అధికారులు శివప్రసాద్, వసుంధర, శ్వేత పాల్గొన్నారు.

## పర్యావరణ రక్షణకు మొక్కలు నాటాలి

### తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్



**ప్రజాపక్షం/తిరుమలగిరి:** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటిలోని నందాపురంలో వనమహోత్సవ కార్య క్రమంలో ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. పర్యావరణ సమతుల్యం దెబ్బ తినడంతో మనిషి మనుగడకే పెను ప్రమాదం ఏర్పడిందన్నారు. ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. చెట్లు ప్రగతికి మెట్లు అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ శాగంటి అనసూర్యరాములు, మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, వైస్ చైర్మన్ కేసిడి సరళ యాదవరెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు వై నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ జుమ్మిలాల్ నాయక్, పట్టణ అధ్యక్షులు పేరాల వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

## అసత్య ప్రచారాలు నమ్మొద్దు

### సూర్యాపేట డిఎస్‌పి రవి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** జిల్లా కేంద్రంలో అంజలి స్కూల్ సమీపంలో గంజాయి సేవించి యువకుడిపై దాడి చేసినట్లు జరుగుతున్న అసత్య ప్రచారాలను ఎవ్వరు నమ్మవద్దని సూర్యాపేట డిఎస్‌పి రవి అన్నారు. శుక్రవారం ఆయన సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ యువకుడిపై జరిగిన దాడిపై తాను అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. యువకుడిపై జరిగిన దాడి గంజాయి మత్తులో చేశారా.. లేదా అన్నది తెలాల్సి ఉందన్నారు. సోషల్ మీడియాలో ఇలాంటి వార్తలు వైరల్ చేయవద్దని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే సంఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడిస్తామని చెప్పారు. గంజాయి మత్తులో దాడి చేసి ఉంటే అందుకు బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి సేవించిన, విక్రయించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో పాటు సంఘటన స్థలాన్ని పరిశీలించిన వారిలో ఎస్ఐ బాలకృష్ణ ఉన్నారు.

## నిరక్షరాస్యులకు విద్యనందించాలి

### వయోజన విద్య ప్రాజెక్టు ఆఫీసర్ కె. అనిత

**ప్రజాపక్షం/అయిజ :** నిరక్షరాస్యులందరికి విద్య నందించడం మన అందరి బాధ్యత అని వయోజన విద్య ప్రాజెక్టు ఆఫీసర్ కె. అనిత పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ రాములు ఆధ్వర్యంలో నిర్వహించిన న్యూ ఇం డియా లిటరసీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ఇది కేంద్ర ప్రభుత్వ పథకమని, 15 సంవత్సరాలు పైబడిన వారందరిని అక్షరాస్యులుగా మార్చడంతో పాటు డిజిటల్ పరిజ్ఞానం అర్థిక,కుటుంబ సంక్షేమం, పరిసరాల పరిశుభ్రత,ఆరోగ్య పరిరక్షణ,అనే అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపన్యాస బృందం పాల్గొన్నారు.

## ప్రజలు భాగస్వాములు కావాలి

**ప్రజాపక్షం/అయిజ :** గ్రామీణ ప్రాంత ఆవిష్కరణలకు సాధికారత కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్న ఇం టింటా ఇన్నోవేషన్ కార్యక్రమంలో అన్నీ వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని ఎంపిడిఓ చెన్నయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఎంపిడిఓ కార్యాలయంలో ఇంటింటా ఇన్నోవేషన్ 2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అద్భుతమైన ఆలోచనలు, ప్రాజెక్టులను, సమర్పించే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ అవకాశాన్ని అర్హత ఉన్న అవిష్కర్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆవిష్కరణ ధరకాస్తులను 9542746728 వాట్సాప్ నెంబర్‌కు ఆగస్టు 3వ తేదిలోపు పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిఎస్ఐసి డిస్ట్రిక్ట్ ఇన్నోవేషన్ కో ఆర్డినేటర్ జగదీష్, మండలంలోని పంచాయతి సెక్రెటరీలు,పాల్గొన్నారు.

## మహిళా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నాగమణి నియామకం

**ప్రజాపక్షం/నల్లగొండటౌన్ :** మహిళా కాంగ్రెస్ కమిటీ నల్లగొండ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా నల్లగొండ పట్టణానికి చెందిన కందిమళ్ల నాగమణి రెడ్డిని జిల్లా కాంగ్రెస్ కమిటీ మహిళా విభాగం అధ్యక్షురాలు గోపగాని మాధవి సమక్షంలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు భవనాలు , సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నియమించి శుక్రవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన జిల్లా మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి,కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు శంకర్ నాయక్, మహిళా జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవిలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

### అదనపు కలెక్టర్ కె.గంగాధర్

**ప్రజాపక్షం/భువనగిరి:** సీజనల్ వ్యాధుల పట్ల అన్ని రకాల జాగ్రత్తలు తీసుకొని వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కే.గంగాధర్ అన్నారు. జిల్లా కేంద్ర ఆసుపత్రిని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని వార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న సౌకర్యాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఆయా రిజిస్టర్లు తనిఖీ చేసి పేషెంట్లకు అందుతున్న సేవలు, మందుల వివరాలను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత చాలా ముఖ్యమని, పారిశుద్య చర్యలను పక్కాగా నిర్వహించాలని, ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలని, నీరు ఎక్కడ కూడా నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రికి మిషన్ భగీరథ ద్వారా మంచినీరు అందించాలని ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కు సూచించారు. అడిషనల్ కలెక్టర్ వెంట మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ మల్లిఖార్జున్, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# యాదాద్రిలో వైద్యకళాశాల లేనట్టే!

**అనుమతి నిరాకరించిన జాతీయ వైద్య మండలి**

**మౌలిక వసతులు లేకపోవడమే కారణం**

**ప్రజాపక్షం/భువనగిరి :** రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ముందు చూపు లేని కారణంతో పా టు జిల్లా అధికార యంత్రాంగం అలసత్వం నిర్ల క్ష్యం కారణంగా ఈ యాదాద్రి భువనగిరి జిల్లాకు మంజూరైన మెడికల్ కాలేజీ ఈ సంవత్సరం ఇక లేనట్టే. ఈ యాదాద్రి భువనగిరి జిల్లాలో మంజూరైన మెడికల్ కళాశాలను పగిడిపల్లి లోని పాత కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేయడానికి జిల్లా అధికార యంత్రాంగం ఉపక్రమించింది. అయితే ఈ కళాశాలలో మౌలిక వసతుల కల్పన సంబంధించి ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో ఢిల్లీ నుంచి వచ్చినటువంటి జాతీయ వైద్య మండలి అనుమతులకు నిరాకరించడంతో ఈ ఏడు ప్రారంభం కావలసిన మెడికల్ కాలేజీ వచ్చే ఏడాదికి వాయిదా పడింది. ఢిల్లీ నుండి జాతీయ వైద్య మండలి బృందం మెడికల్ కళాశాల తనిఖీకి వస్తున్న విషయం జిల్లా యంత్రాంగానికి తెలిసినప్పటికీ ముందస్తు ఏర్పాట్లు చేయకపోవడంతో పాటు అధికార బృందం వచ్చే సమయానికి కూడా గేటు తాళాలు తెరిచి ఉండకపోవడంతో ఢిల్లీ నుంచి వచ్చిన అధికారులు నివ్వెర పోయారు. మెడికల్ కళాశాల ఏర్పాటుకు జాతీయ వైద్య మండలి నియమనిబంధన లకు లోబడి అన్ని మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. మెడికల్ విద్యార్థులు చదువుకోవడానికి తరగతి గదులు ల్యాబ్స్‌తో పాటు అన్ని మౌ లిక వసతులను ఈ రాష్ట్ర ప్రభుత్వం కల్పించినప్పుడే కేంద్రం జాతీయ వైద్య మండలి ద్వారా విద్యార్థులను కేటాయిస్తుంది. అయితే కౌన్సిలింగ్ జరుగుతున్న నేపథ్యంలో మెడికల్ కళాశాలకు విద్యార్థులను కేటాయించడానికి ముందుగా మౌలిక వసతులను పర్యవేక్షించడానికి ఢిల్లీ నుంచి ప్రత్యేక బృందం వచ్చింది. ఈ ఢిల్లీ బృందానికి ప్ర స్తుతం ఏర్పాటు చేసిన కళాశాల ప్రాంగణం విశాలంగా ఉన్నప్పటికీ ప్రొఫెసర్లు, డాక్టర్లు, వైద్య సిబ్బంది, తరగతి గదులు, ల్యాబ్స్, ఇతర మౌలిక వసతులు లేకపో వడంతో అనుమతులు ఇవ్వడానికి నిరాకరించారని తెలుస్తున్నది. గత ప్రభుత్వం యాదాద్రి భువనగిరి జిల్లాకు 2023లో మెడికల్ కళాశాల మంజూరు చేసింది. దీంతో కళాశాల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ప్రస్తుతం యాదాద్రి దేవస్థానం సమీపంలోని యాదగిరిగుట్ట మండలం దాతర్ పల్లి గ్రామ శివారులో నూతన వైద్య కళాశాల భవనం నిర్మిస్తున్నారు. అప్పటి వరకు జిల్లా కేంద్రం సమీపంలోని పగిడిపల్లి శివారులో పాత కలెక్టరేట్ అద్దె భవనంలో ఏర్పాటు చేసిన్నట్లు బోర్డు ఏర్పాటు చేసి ప్రతిపాదనలు పంపారు. ఐతే మెడికల్ కళాశాల ఏర్పాటుకు 350 పడకల ఆస్పత్రి అందుబాటులో ఉండాలనేది నిబంధన. అయితే జిల్లా కేంద్ర ఆస్పత్రితోపాటు ఎంసీ హెచ్, ఆస్పత్రులు ఉన్నాయని మెడికల్ కళాశాల నిర్వహణకు సరిపోతుందని నిర్ణ యిం చారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు గత ప్రభుత్వంలో జిల్లా వైద్య కళాశాల మంజూరైందంటే జిల్లా ప్రజలు ఎంతగానో సంతోషించారు. చివరికి యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని యాదగిరిగుట్ట మండల పరిధిలోని దాతర్‌పల్లి గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో జిల్లా వైద్య కళాశాల భవనం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అంతేకాకుండా భవనం పూర్తి అయ్యేంత వరకు భువనగిరి జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ అద్దె భవనంలో ఏర్పాటుచేసిన్నట్లు ప్రకటన చేసి జిల్లా వైద్య కళాశాల అనే బోర్డును సైతం ఏర్పాటుచేశారు.ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న జిల్లా వాసుల కల నెరవేరిందని జిల్లా ప్రజలు ఎంతగానో సంబురపడ్డారు. అయితే మెడికల్ కళాశాల ఏర్పాటుకు సరైన వసతులులేవని,సిబ్బంది కొరత ఉందనే కారణంతో జాతీయ వైద్య మండలి కళాశాల అనుమతిని నిరాకరించినట్లు సమాచారం. దీంతో జిల్లా వైద్య విద్యార్థులు ఒక్కసారిగా తీవ్ర నిరాశకు లోనయ్యారు.




### ప్రిన్సిపాల్ మల్లికార్జున్ వివరణ

జాతీయ వైద్యమండలి జిల్లా వైద్య కళాశాల ఏర్పాటుకు అనుమతులు నిరాకరించిన మాట వాస్తవమే అన్నారు. జిల్లా వైద్య కళాశాలలో సిబ్బంది నియామకం, మౌలిక వసతుల ఏర్పాటుకు ఎన్నికల కోడ్ ఆటంకంగా మారడంతో పూర్తిస్థాయిలో సిబ్బంది నియామకాలు, మౌలిక వసతుల ఏర్పాటు చేయలేకపోయామన్నారు. త్వరలోనే సిబ్బంది నియామకాలు చేపట్టి మౌలిక వసతులు కల్పించి జాతీయ వైద్య మండలికి నివేదిక అందజేస్తామని కళాశాల అనుమతుల కోసం పూర్తిస్థాయిలో కృషి చేస్తామని ఆయన వివరించారు.

### ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు కోసం

## ఉద్యమానికి సిద్ధం కండి

### ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్

**ప్రజాపక్షం/హుజురాబాద్ :** తెలంగాణలో విధ్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడంలో గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఇప్పటికైనా ఈ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెంటనే ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ విధ్యార్థులకివ్వాల్సిన దాదాపు 7 కోట్ల పైగా బకాయిలున్నా యని, స్వరాష్ట్రం వస్తే నిధులు నియామకాలు వస్తా యని విద్యార్థులు కోటి ఆశలతో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో విద్యార్థులకు మొండి చేయి చూపడం చాలా అన్యాయమన్నారు.




అదే విధంగా ఫీజు బకా యిలు సరిగా విడుదల చేయకపోవంతో కళాశాల యాజమాన్యాలు విధ్యార్థులను ఫీజులు కట్టాలని వేధిస్తున్న పరిస్థితి కనిపిస్తోందని, ఇప్పటికైనా ఈ కొత్త ప్రభుత్వం ఉన్నత విద్య పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి విద్యార్థులను అందుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు విడుదల చేయాలని తెలిపారు.

## ప్రభుత్వ స్థలాలను కాపాడాలి

**ప్రజాపక్షం/నల్లగొండ :** వర్షం కారణంగా చెరువులు, కుంటలకు గండ్లు పడకుండా ముందే పటిష్ట చర్యలు తీ సుకోవాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆర్డీవోలు, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ఎక్కడైనా వర్షం నీటికి తెగిపోయెందుకు,గండ్లు పడేందుకు అవకాశం ఉన్న చెరువులను గుర్తించి వాటికి తగిన విధంగా మరమ్మతులు చేపట్టాలన్నారు. ,ఒండ్రు మట్టి, మొరం ,ఇసుక వంటివి అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని, ఏవైనా సమస్యలు ఉంటే తక్షణమే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.ప్రభుత్వ, అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా కంచె వేయించాలని,భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా వచ్చే శుక్రవారం నాటికి అన్ని ప్రభుత్వ స్థలాలకు కంచె ఏర్పాటు చేయాలని చెప్పారు. జిల్లాలోని వివిధ ప్రాజక్టుల కింద భూసేకరణను ఆయన సమీక్షిస్తూ ప్రాధాన్యత ప్రకారంగా భూసేకరణ సమస్యలు పరిష్కరించాలని, అలాగే ప్రాజక్టుల పనులకు సంబంధించి పురోగతి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లా కలెక్టర్ ఆయా ప్రాజెక్టుల కింద రిజర్వాయర్ల వారీగా భూసేకరణ పిఎన్, పి డి తదితర వివరాలను ఇంజనీరింగ్ అధికారులతో అడిగి తెలుసుకున్నారు. భూసేకరణపై సోమవారం లేదా మంగళవారం సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులతో సమావేశం నిర్వహించాచాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్,స్పెషల్ కలెక్టర్ నటరాజ్ ,డిఎఫ్ఓ రాజశేఖర్, ఎస్ఎల్‌బిసి సూపరింటిండెంట్ ఇంజనీర్ శ్రీనివాస్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## నలుగురు లా ఆఫీసర్ల నియామకాలు



**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్:** జిల్లాలో నలుగురు ప్లీడర్లను లా ఆఫీసర్లుగా విధులను నిర్వహించాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. హైకోర్టు పరిధిలో ఉన్న ఆయా కోర్టులలో విధులు నిర్వహించడానికి అదనపు ప్రభుత్వ ప్లీడర్లు, ప్రత్యేక ప్రభుత్వ ప్లీడర్లు, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్లను శాసన వ్యవహారాలు, న్యాయశాఖ ఎంపిక చేసింది. గవర్నమెంట్ ప్లీడర్‌గా కల్లూరి రవిందర్ రెడ్డి,అడిషనల్ గవర్నమెంట్ ప్లీడర్ గా ఎం.ఏ రహీమ్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్లు గా భీమగాని హరిబాబు గౌడ్ ,మక్తాల నరసింహలను ఆరునెలల కాలానికి కాకుండా ప్రభుత్వం నియామకాలు చేపట్టే వరకు విధులను నిర్వహించేలా జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే ఉత్తర్వులు జారీ చేసారు.వీరు సీనియర్ సివిల్ కోసం అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ జడ్జి కోర్టు , ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ భువనగిరి, ఆలేరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు,రామన్నపేట చౌటుప్పల్ కోర్టు లలో విధులను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వారికి ఆదేశాలను జారీ చేసారు.

## ప్రభుత్వాసుపత్రుల్లో అత్యాధునిక సౌకర్యాలు

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి :** మహిళల సమస్యల పరిష్కారానికే అంగన్‌వాడీ కేం ద్రాల్లో శుక్రవారం సభకు శ్రీకారం చుట్టామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పే ర్కొన్నారు. మహిళల ఆరోగ్యం, భద్రతతో పాటు సమస్యల పరిష్కారానికి ఇందులో ప్రాధాన్యతనిస్తామని తెలిపారు. శుక్రవారం కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సభ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు కుటుంబం కోసం ప్రతి రోజు హెల్తీ ఫుడ్ తీసుకోవాలని, వారు బాగుంటేనే ఆ ఇల్లు బాగుంటుందని, ఆ జిల్లా బాగుంటుందని పేర్కొన్నారు. జిల్లాలో వినూత్నంగా శుక్రవారం సభకు శ్రీకారం చుట్టామని, అంగన్‌వాడీ కేంద్రాలను గర్భిణీలు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిన్నారులు మహిళల సంపూర్ణ ఆరోగ్యానికి ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని, గర్భిణులకు సాధారణ ప్రసవాలు జరిగేలా యోగాతో పాటు సరైన సూచనలు, సలహాలు వైద్య సిబ్బంది అందిస్తారని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సర్కారు అత్యాధునిక సదుపాయాలను కల్పిస్తు ఒదని పేర్కొ న్నారు. ప్రైవేటుకు ధీటుగా పనిచేస్తున్నాయని, ప్రజలంతా వీటిని సద్విని యోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేసుకో వద్దని , పోషకాహారం తీసుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత , అందరూ తమ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆరోగ్యపర మైన సమస్యల పరిష్కారంతో పాటు సమాజంలో నెలకొన్న వివిధ రుగ్మతల నిర్మూలనకు శుక్రవారం సభ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి సుజాత, ఎంపిడివో ప్రభు, సిడిపిఓ ఉమారాణి, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 జిల్లా కో ఆర్డినేటర్ సంపత్, మహిళా శక్తి కో ఆర్డినేటర్ శ్రీలత, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, సూపర్‌వైజర్ అరుణ, టీచర్స్, వైద్య సిబ్బంది, అంగన్ వాడీ టీచర్స్, ఆశవర్కర్స్, మహిళలు పాల్గొన్నారు.



## ‘ధరణి’ సరిచేస్తేనే నిష్పాక్షిక రైతు భరోసా

**అనర్హులకు అందుతున్న రైతు భరోసా**

**రియల్ ఎస్టేట్ భూములు, గ్రానైట్ క్వారీలకు రైతు భరోసా**

**వాస్తవ విస్తీర్ణం కంటే పాసుపుస్తకాల్లో ఎక్కువ**

**చిన్న, సన్నకారు రైతులకు శాపంగా మారిన ధరణి**




**ప్రజాపక్షం/ఖమ్మం:** ప్రభుత్వం రైతు భరోసా విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించడమే కాకుండా వాస్తవ సాగు భూమికే రైతు భరోసా అందించాలని నిర్ణయించడం హర్షించదగిన విషయమే కానీ గత ప్రభుత్వం తీసుకు వచ్చిన ధరణి చట్టంలోని లోపాలను సవరించకుండా సాగు భూమికి, వాస్తవ సాగుదారులకు రైతు భరోసా అందించడం సాధ్యం కాదు. ధరణిలోని లోపాలు చిన్న, సన్నకారు రైతులకు శాపంగా మారితే పెద్ద పెద్ద భూ కమతాలు కలిగిన వారి పాలిట సానుకూల అంశంగా మారింది. 20 ఏళ్ల క్రితం వ్యవసాయేతర భూమిగా మార్చి ఇండ్లు నిర్మించుకున్న పట్టణానికి అనుకుని ఉన్న వేల ఎకరాల భూములకు రైతు భరోసా వస్తుంది. రెవెన్యూ రికార్డులలో వ్యవసాయేతర భూమిగా మార్పు చెందిన పట్టా దారు పాసుపుస్తకాలు అందజేయడంతో రైతు భరోసాకు ఇబ్బంది లేకుండాపోయింది. వ్యవసాయేతర భూములుగా మార్చుకుని రియల్ ఎస్టేట్ వెంచర్లు ఏర్పాటు చేసిన వేల ఎకరాల భూములకు ఇప్పుడు రైతు బంధును గత ప్రభుత్వం అందిస్తుంది. గ్రానైట్ క్వారీలు, వాగులు, వంకలు క్షేత్ర స్థాయి రెవెన్యూ సిబ్బందిని ప్రలోభపరిచి పట్టాదారు పాసుపుస్తకాల్లో నమోదు చేయించుకున్నారు. కొంత మంది ప్రబుద్ధులు మరో అడుగు ముందుకేశారు. ఖమ్మం రూరల్ మండలంలో ఒక గ్రామంలో వాస్తవ సాగుభూమి 1100 ఎకరాలు ఉండగా పట్టాదారు పాసుపుస్తకాల ప్రకారం మొత్తం విస్తీర్ణం 1400లకు చేరినట్లు తెలుస్తుంది. ఇందులో గ్రానైట్ క్వారీలు, వాగులు, వంకలు పట్టా భూములుగా నమోదయ్యాయి. 300 ఎకరాలు అదనంగా ఎలా వచ్చి చేరిందన్న దానిపై విచారణలేదు. ఇది ఒక గ్రామానికో లేదా రెండు గ్రామాలకో పరిమితం కాలేదు. కల్లూరు, వైరా సహా పలు మండలాల్లోని రెవెన్యూ గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంది. బోనకల్ మండలంలో ఓ రైతు తనకు వాస్తవ సాగు రెండు ఎకరాలు ఉండగా అప్పటి రెవెన్యూ సిబ్బంది అతని పేర ఐదున్నర ఎకరాల పట్టా చేశారని దీనిపై కొందరు గతంలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న నాధుడు లేదు. తెలంగాణలో గడిచిన పదేళ్ల కాలంలో భూ కమతాలు పెరిగాయి. భూమి వ్యాపార వస్తువుగా మారిన తర్వాత వ్యాపార వర్గాలు భూమిపై పెట్టుబడి పెట్టడం తిరిగి అమ్మకాలు చేయడం కోసం వేల ఎకరాలను కొనుగోలు చేశారు. మారు మూల గ్రామాలలో సైతం వంద, యాభై ఎకరాలు నగరాలకు చెందిన రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు కొనుగోలు చేశారంటే ఏ మాత్రం అతిశయోక్తి లేదు. ఇప్పుడు ఆ భూములన్నింటికి రైతుబంధును వర్తింపజేస్తున్నారు. ఇటువంటి వాటిపై చర్యలు తీసుకోకుండా రైతు భరోసాను ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తే మళ్లీ సన్న, చిన్నకారు రైతులు, ఎగుమ, దిగువ, మధ్య తరగతి రైతులకు కాకుండా మళ్లీ రైతు భరోసా వ్యాపారులు, రాజకీయ వేత్తలు, ప్రజా ప్రతినిధుల ఖాతాల్లోకి చేరుతుంది. వ్యవసాయేతర భూమిగా మారిన తర్వాత కూ డా పట్టాదారు పాసుపుస్తకాల్లో సాగు భూమిగా కొనసాగుతున్న లక్షలాది ఎకరాలను పట్టాదారు పాసుపుస్తకాల నుంచి తొలగించాల్సి ఉంది. అలాగే గ్రానైట్ క్వారీలు, ఊర చెరువులు, వా గులు పట్టాలు చేయించుకున్న వ్యక్తుల నుంచి వాస్తవ సాగు భూమిని మినహాయించి మిగిలిన భూమిని విడగొట్టాల్సి ఉంది. పైన పే ర్కొన్న విధంగా కొందరికి ఇది సానుకూల అం శంగా మారితే మరి కొందరికి శాపంగా మా రింది. 1980 దశకంలో ప్రభుత్వం ఓ సర్వే నెంబరులోని కొంత భూమిని సేకరిస్తే ఇప్పుడు ధరణి పుణ్యమా అని ఆ సర్వే నెంబరు మొత్తం ప్రభుత్వ భూమిగా చూపుతుంది. అలాగే 1970 దశకంలో ఖమ్మంజిల్లాలో నాగార్జున సాగర్ కాలువ నిర్మాణం కోసం భూమిని సేకరించారు. కాలువ కోసం సేకరించిన భూములకు సంబంధి ంచి కూడా ఆసర్వే నెంబర్లు అన్ని ప్రభుత్వ భూ ములుగానే ధరణిలో చూపెడుతున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే లక్షల ఎకరాల భూమి ధరణి పుణ్యమా అని భూ రికార్డుల్లో ప్రభుత్వ భూములుగా నమోదు కావడంతో అసలైన రైతులు తీ వ్రంగా నష్టపోతున్నారు. కలెక్టర్ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా ఈ సమస్యకు పరిష్కారం దొరక లేదు. ఇప్పుడు ధరణిలో సమస్యలకు పరిష్కారం చూపకుండా రైతు భరోసాను అమలు చేస్తే మళ్లీ పాత కథే పునరావృతమవుతుంది. రైతు భరోసా అమలుకు ముందు ధరణి లో పెండింగ్‌లో ఉన్న సమస్యలకు తక్షణం పరిష్కారం చూపడంతో పాటు వ్యవసాయేతర భూ ములకు అందుతున్న రైతు భరోసా పై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాటికి రైతు భరోసా అందకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది. లేకపోతే మరల అవే సమస్యలు పునరావృతమవుతాయి. మళ్లీ అనర్హులకే లబ్ది చేకూరే అవకాశం ఉంది.

## అప్పల బాధతో రైతు ఆత్మహత్య

**ప్రజాపక్షం/చందంపేట:** అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న నల్గొండ జిల్లా చందంపేట మండలం తెల్దేవరపల్లి గ్రామంలో చోటు చేసు కుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం భావత్ రమేష్ తనకు ఒక ఎకరం భూమి ఉంది. అందులో గతంలో మూడు బోర్లు వేస్తే నీళ్లు రాకపోవడంతో అప్పులు పాలయ్యాడని, ఆదే విధంగా నాలుగు ఎకరాలు కౌలుకు చేస్తున్న తరుణంలో ఈ సంవత్సరం వర్షాలు లేక వేసిన గింజలు మొలకెత్తకపోవడంతో బుధవారం తను సాగు చేస్తున్న వ్యవసాయ భూములోని చెట్టుకు ఉరివేసుకొని ఉన్నాడని తెలి పారు. ఆ చుట్టుపక్కల వ్యవసాయదారులు గమనించి వెంటనే దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు సిరియస్‌గా ఉందని చెప్పడంతో వారు హైదరాబాద్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. గురువారం రాత్రి మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. అతనికి ఒక కుమారుడు ఒక కూతురు భర్య ఉన్నట్లు తెలిపారు. వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## సిఎంను కలిసిన డాక్టర్ రాజకుమార్

### భువనగిరి చిన్నారులకు సిఎం అభినందనలు

**ప్రజాపక్షం/భువనగిరిరూరల్:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణానికి చెందిన శ్రీ ఆర్కే హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చావా రాజ్ కుమార్, డాక్టర్ చావా అశ్లేష దంపతులు హైదరాబాదులో శుక్రవారం కలిశారు. వారి కుమారుడు మాస్టర్ చావా తారక్ నంద, చావా ఆకృతి ఇండియా బుక్ ఆఫ్ రికార్డు సాధించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి చిన్నారులను అభినందించారు. ఏప్రిల్ నెలలో చిన్నారులకు ఢిల్లీలోని ఇండియా బుక్ ఆఫ్ రికా ర్డును సంస్థ కాన్వకేషన్ నందు ఈ అవార్డును చిన్నారులకు బహుకరించారు. ఈ సందర్భంగా సీఎం చిన్నారులకు అభినందనలు తెలియజేస్తూ వారు ఇటువంటి అవార్డులు మరెన్నో సాధించి వారి తల్లిదండ్రులకు మన రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకు రావలసిందిగా చిన్నారులను ఆశీర్వదించారు.



